నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
7 ఆగస్టు 2024
పేజీలు 8

ఎస్ఏటీహెచ్ఈఈ (సాథీ)

ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ, ఐఐటీ కాన్పూర్‌లో సంయుక్తంగా సెల్ఫ్ అసెస్‌మెంట్, టెస్ట్ అండ్ హెల్ప్ ఫర్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్‌ను ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఉచితంగా పాఠ్యాంశాలు వినడంతో పాటు పరీక్షలు కూడా రాయవచ్చు. ఐఐటీ, ఐఐఎం ప్రొఫెసర్లు వీటిని రూపొందించారు.

రోజులు-ప్రాధాన్యం

జూలై 30

- మానవ అక్రమ రవాణా వ్యతిరేక రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది థీమ్ 'మానవ అక్రమ రవాణా వ్యతిరేక పోరులో ఏ చిన్నారినీ విస్మరించరాదు'.

జూలై 29

- అంతర్జాతీయ పులుల దినోత్సవంగా నిర్వహిస్తారు. పులులు, అవి ఉండే ఆవాసాల పరిరక్షణకు సంబంధించి అందరికీ అవగాహన కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో పులులు ఉన్న దేశం భారత్. దేశంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో పులులు ఉన్నాయి.

జూలై 26

- మడ అడవుల ఆవరణ వ్యవస్థలను పరిరక్షించుకొనేందుకు ఉద్దేశించిన రోజు. తీర ప్రాంతాల భద్రత, జీవ వైవిధ్య పరిరక్షణలో మడ అడవుల వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయి.

జాతీయం

తరంగ్ శక్తి

- తరంగ్ శక్తి పేరుతో వాయు విన్యాసాన్ని భారత్ నిర్వహించనుంది. రెండు దశల్లో నిర్వహించే ఈ విన్యాసాల్లో 51 దేశాలు పాల్గొంటాయి. భారత్ నిర్వహించే వాయు విన్యాసాల్లో ఇదే అతిపెద్దది. ఆగస్టు 6 నుంచి 14 వరకు తొలి దశ తమిళనాడులోని సూలూరులో, రెండో దశ సెప్టెంబర్ 1 నుంచి 14 వరకు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో నిర్వహిస్తారు.

ఎన్ఏటీఎస్

- నైపుణ్యాల పెంపుతో పాటు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎన్ఏటీఎస్ 2.0 పేరుతో విద్యా మంత్రిత్వ శాఖ కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది.

ఐటీ, తయారీ, ఆటోమొబైల్ తదితర రంగాలకు సంబంధించి ఈ పోర్టల్ నైపుణ్యాల పెంపుతో పాటు ఉద్యోగాలను కల్పిస్తుంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇది ఉంది.

ఎస్సీ వర్గీకరణ

- ఎస్సీ ఉప వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఎస్సీల ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రాలకు ఉన్న అధికారం రాజ్యాంగబద్ధమైందే అని వెల్లడించింది. వర్గీకరణను కొట్టేస్తూ 2004 నవంబర్ 5న ఈవీ చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తాజా తీర్పులో కొట్టివేసింది.

ఫోన్ల రికవరీలో రెండో స్థానం

- చోరీకి గురైనా లేదా పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ కనుక్కుని తిరిగి బాధితులకు అందించడంలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. తొలి స్థానంలో కర్ణాటక ఉంది.

అంతర్జాతీయం

కేఐఐటీకి ప్రత్యేక సంప్రదింపుల హోదా

- సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పోషించిన పాత్రకు కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీకి ప్రత్యేక సంప్రదింపుల స్థాయి వ్యవస్థగా గుర్తిస్తూ ఐక్యరాజ్య సమితి సామాజిక-ఆర్థిక మండలి నిర్ణయం తీసుకుంది. క్యూఎస్ ర్యాంకింగ్‌లో దేశంలో నుంచి 5 స్టార్ రేటింగ్‌ను పొందిన తొలి విశ్వ విద్యాలయం ఇది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇచ్చే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో 16వ స్థానంలో ఉంది.

ప్రపంచ బ్యాంక్ నివేదిక

- పర్యావరణ మార్పుతో విద్యా నష్టం సంభవించిందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. 2005-24 మధ్య దత్తాంశాన్ని పరిశీలించి పలు అంశాలను వెల్లడించింది.

మొత్తం మూతపడిన పాఠశాలకు 75% సందర్భాల్లో కారణం పర్యావరణ మార్పే అని పేర్కొన్నది. ఐదు మిలియన్ల మంది చిన్నారులు చదువుకు దూరమయ్యారని ప్రపంచ బ్యాంక్ నివేదిక వెల్లడించింది.

క్వాడ్

- ఐక్యరాజ్య సమితి జాబితాలో ఉన్న ఉగ్రవాద సంస్థలపై చర్య తీసుకోవాలని క్వాడ్ విదేశాంగ శాఖ మంత్రులు కోరారు. ఈ సమావేశం జపాన్‌లోని టోక్యోలో నిర్వహించారు. ఉగ్రవాదులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగిస్తున్నందున తక్షణమే చర్య తీసుకోవాలని క్వాడ్ కూటమి కోరింది. అలాగే టోక్యోలో మహాత్మాగాంధీ ప్రతిమను భారత విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ ఆవిష్కరించారు.

గూగుల్ నివేదిక

- కృత్రిమ మేధతో 13% కర్బన ఉద్గారాలు పెరిగాయని గూగుల్ తాజా నివేదికలో పేర్కొంది. 2023లో విడుదలైన ఉద్గారాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి వివరాలను వెల్లడించింది. కృత్రిమ మేధ, దాని ఆధారంగా పనిచేసే సాధనాలు అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తాయని దీంతో ఈ ఉద్గారాలు సంభవించాయంటూ గూగుల్ వెల్లడించింది. సాధారణంగా గూగుల్ సెర్చ్ ద్వారా సమాచార సేకరణ కంటే చాట్‌జీపీటీ ద్వారా ఏదైనా సమాచారం సేకరిస్తే 10-33 రెట్లు అధికంగా శక్తి వినియోగం జరుగుతుంది.

ఫ్రాన్స్

- 2024 ఒలింపిక్స్‌కు పారిస్ వేదికగా ఉంది. భారత పెవిలియన్‌ను ఈ నగరంలో భారత ఒలింపిక్ సభ్యురాలు నీతా అంబానీ ప్రారంభించారు. ఒలింపిక్ క్రీడల సందర్భంగా ఈ తరహా పెవిలియన్‌ను ప్రవేశపెట్టిన తొలి సందర్భం ఇదే.

చైనా

- లఢఖ్‌లో వాస్తవాధీన రేఖకు సమీపంలో 400 మీటర్ల పొడవైన వంతెనను చైనా నిర్మించింది. అక్రమంగా చైనా ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకొని నిర్మాణాన్ని చేపట్టిందని భారత్ ఆరోపించింది. 1958 నుంచే ఈ ప్రాంతం చైనా ఆధీనంలో ఉంది. టిబెట్‌కు ఇది పశ్చిమాన ఉంటుంది. అలాగే చైనా మరో అంశం రీత్యా కూడా వార్తల్లో ఉంది. థోరియం ఇంధనంగా ప్రపంచంలోనే తొలి అణు విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించనుంది. 2025లో దీన్ని ఏర్పాటు చేయనుంది. గోబీ ఎడారిలో ఈ అణు విద్యుత్ ప్లాంట్ రానుంది. సాధారణంగా యురేనియాన్ని వినియోగిస్తారు. కానీ చైనా థోరియాన్ని ఉపయోగించనుంది.

అమెరికా

- భారత్‌కు ఎల్ఎన్‌జీని ఎగుమతి చేస్తున్న దేశాల జాబితాలో అమెరికా రెండో స్థానంలోకి వచ్చింది. గతంలో ఈ స్థానంలో యూఏఈ ఉండేది. 3.09 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని అమెరికా భారత్‌కు సరఫరా చేసింది. ప్రపంచంలో ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకొనే దేశాల జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. భారత్‌కు అతిపెద్ద సరఫరా దారు ఖతార్.

తెలంగాణ

నైపుణ్య విశ్వ విద్యాలయం

- యంగ్ ఇండియా నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయానికి ఆగస్ట్ 1న రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం సమీపంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలోని బేగరికంచలో దీన్ని

నిర్మించనున్నారు. రూ.150 కోట్లు దీనికి వెచ్చించనున్నారు. ఈ నైపుణ్య విశ్వవిద్యాలయంలో 17 రకాల కోర్సులు అందుబాటులో ఉంటాయి.

గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు నిధులు

- రూ. 437 కోట్ల వ్యయంతో గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్ట్ 1న నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న ఇతర నిర్ణయాలు..
- రేషన్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డులను విడివిడిగా ఇవ్వడం
- ఇషా సింగ్, నిఖత్ జరీన్, మహ్మద్ సిరాజ్‌లకు హైదరాబాద్‌లో స్థలం, గ్రూప్-1 ఉద్యోగం.

వెమ్ టెక్నాలజీస్ పెట్టుబడులు

- రక్షణ రంగ సంస్థ వెమ్ టెక్నాలజీస్ రాష్ట్రంలో తొలి దశలో రూ.1000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. జహీరాబాద్‌లోని నిమ్జ్‌లో తొలి దశలో 511 ఎకరాల్లో సంస్థను ఏర్పాటు చేయనుంది. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ట్రయల్ పద్ధతిలో ఉత్పత్తి ప్రారంభం కానుంది.

టైం జాబితాలో మూడు ప్రదేశాలు

- ప్రపంచంలో 2024లో దర్శించదగ్గ ప్రదేశాల జాబితాలో భారత్ నుంచి మూడింటిని ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని మనం

చాక్లెట్ కార్నానా, ముంబయిలోని మ్యూజియం ఆఫ్ సొల్యూషన్స్, హిమాచల్ ప్రదేశ్‌లోని ఎన్ఏఏఆర్ (నార్) ఇందులో ఉన్నాయి. హైదరాబాద్‌లో మనం చాక్లెట్‌ను ముప్పాళ్ల చైతన్య ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. దేశంలోనే పండిన పదార్థాలతో చాక్లెట్లను తయారు చేస్తున్నారు. అలాగే ముంబయిలోని మ్యూజియం ఆఫ్ సొల్యూషన్స్ చిన్నారులకు శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన కల్పిస్తుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని నార్ ఒక బొటిక్ హోటల్. హిమలయాల్లో లభించే పదార్థాలతో తయారు చేసిన వంటకాలనే అందిస్తూ ప్రత్యేకతను సంతరించుకున్నారు.

ఆర్థికం

యూనికార్న్‌గా ర్యాపిడో

- ర్యాపిడో సంస్థ యూనికార్న్‌గా మారింది. 120 మిలియన్ డాలర్లు ఆర్జించింది. 2015లో ఈ సంస్థను స్థాపించారు. 2024లో యూనికార్న్ స్థాయిని పొందిన సంస్థల్లో ఇది మూడోది. ఇప్పటికే పెర్ప్లెక్సిటీ, క్రుత్రిం ఈ హోదాను పొందాయి.

సెబీ

- వినియోగదారుల కోసం ఎస్ఈవీఏ (సేవ) అనే పేరుతో సెబీ ఒక కొత్త చాట్‌బాట్‌ను అందుబాటులోకి తెచ్చింది. కృత్రిమ మేధతో ఇది పనిచేస్తుంది. పెట్టుబడిదారులకు ఎలాంటి సందేహాలున్నా ఈ చాట్ బాట్ నివృత్తి చేస్తుంది.

క్రీడలు

మను భాకర్

- హర్యానా రాష్ట్రానికి చెందిన మను భాకర్ 2024 ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలను పొందిన భారత తొలి మహిళ క్రీడాకారిణిగా రికార్డ్ నెలకొల్పింది. 1900లో జరిగిన ఒలింపిక్స్‌లో భారత్ తరఫున నార్మన్ ప్రిచర్డ్ రెండు పతకాలు పొందాడు. ఆ తర్వాత ఈ ఒలింపిక్స్‌లోనే ఈ విజయం నమోదయ్యింది. 10 మీ. పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం, సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో మరో కాంస్య పతకాన్ని గెలిచింది. 50 మీ. రైఫిల్‌లో స్వప్నిల్ కుసాలే కాంస్యం సాధించాడు.

వార్తల్లో వ్యక్తులు

ప్రీతి సూదన్

- యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా కేంద్ర వైద్య శాఖ మాజీ కార్యదర్శి ప్రీతి సూదన్ నియమితులయ్యారు. ఆగస్ట్ 1 ఆమె బాధ్యతలు స్వీకరించారు. రాజ్యాంగంలోని 316(1ఎ) అధికరణం ప్రకారం రాష్ట్రపతి ఆమెను నియమించారు.

సాధనా సక్సేనా నాయర్

- సైన్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ మెడికల్

సర్వీసెస్‌గా నియమితులయ్యారు సాధనా సక్సేనా నాయర్. ఈ ఘనతను దక్కించుకున్న తొలి మహిళ ఆమె. పశ్చిమ ఎయిర్ కమాండ్‌కు కూడా ప్రధానాధికారిగా ఆమె పని చేశారు.

నికోలస్ మదురో

- వెనెజులా అధ్యక్షుడిగా నికోలస్ మదురో ఎన్నికయ్యారు. ఆయన ఈ బాధ్యతను చేపట్టడం ఇది మూడోసారి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి.

మనోజ్ మిట్టల్

- స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మనోజ్ మిట్టల్ నియమితులయ్యారు.

జియా రాయ్

- ప్రపంచంలో అతి పిన్న వయసుతో పాటు, అత్యంత వేగంగా ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన పారా స్విమ్మర్‌గా జియా రాయ్

రికార్డు సృష్టించింది. 34 కిలోమీటర్ల కాలువను 17 గంటల 25 నిమిషాల్లో పూర్తి చేసింది.

నిడ కొల్లెడో

- ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన నిడా కొల్లెడోకు ప్రతిష్ఠాత్మక 'వంగరి మథాయ్ ఫారెస్ట్ చాంపియన్ అవార్డ్-2024' దక్కింది. అడవులు, తీర ప్రాంతాల పరిరక్షణకు ఆమె చేసిన కృషికి ఈ అవార్డ్ దక్కింది. ఈ అవార్డును 2012లో నెలకొల్పారు.

వి. రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411